సబ్బవరం రూరల్ వాసవి క్లబ్ ని సందర్శించిన రీజనల్ చైర్ పర్సన్ జంగాల ఫణి

విశాలాంధ్ర-సబ్బవరం: అనకాపల్లి జిల్లా ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ జంగాల ఫణి పర్యటనలో భాగంగా బుధవారం సబ్బవరం రూరల్ వాసవి క్లబ్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెసిజియఫ్ అండ్ వికెఎస్పి గురించి వివరించారు. అలాగే మా క్లబ్ నుంచి 3 వికెఎస్పి 3 కెసిజియఫ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా దేవాడ గ్రామానికి చెందిన నిరుపేద వైశ్య కుటుంబానికి చెందిన శ్రీను యాక్సిడెంట్ అయిన కారణంగా ఆ కుటుంబానికి మా క్లబ్ తరఫున 5 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు . ఈ సందర్భంగా శ్రీను వాసవి క్లబ్ సబ్బవరం రూరల్ వాసవి క్లబ్ ట్రస్ట్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ చైర్పర్సన్ బండారు నాగ వెంకట రామారావు, క్లబ్ ప్రెసిడెంట్ దంగేటి సంతోష్ గుప్తా, సెక్రటరీ దంగేటి సన్యాసిరావు, ట్రెజరర్ నున్న సతీష్, గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇంటిస్థలాల క్రమబద్ధీకరణ అమలు చేయాలి

కలెక్టర్ విజయ కృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ప్రభుత్వం పేదలకు కల్పిస్తున్న ఇంటిస్థలాల క్రమబద్ధీకరణ పథకాన్ని అర్హులైన వారందరికీ అమలు చేయాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో తహశీల్దార్లు, మండల కేంద్ర డిప్యూటీ తహశీల్దార్లతో పి.జి.ఆర్.ఎస్., రీసర్వే, అర్జీల పరిష్కారం, గ్రామసభలు, వెబ్ ల్యాండు, ఇళ్ల స్థలాల రీ-వెరిఫికేషను, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రికార్డు రూంల నిర్వహణ తదితర అంశాలపై జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల వారీగా తహశీల్దార్లు, మండల కేంద్ర డిప్యూటీ తహశీల్దార్లను వారు నిర్వహిస్తున్న విధులు వివరాలు అడిగితెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ. కార్యాలయంనకు వచ్చే ధరఖాస్తులు, అర్జీలు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ అధికారులు ప్రజల నుండి పిర్యాదులు రాకుండా పనిచేయాలని, మెరుగైన సేవలు సకాలంలో అందించాలని, మండల కార్యాలయాల నిర్వహణలో డిప్యూటీ తహశీల్దారులది కీలకభాద్యతఅని, వారు బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో పేదలు నిర్మించుకున్న స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం తీసుకువచ్చిన పథకం గుర్చి ప్రజలకు తెలియజేయాలని, విస్తృత ప్రచారం కల్పించాలని, అర్హులైన వారందరూ ఈ పథకానికి ధరఖాస్తుచేసుకొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభ్యంతరంలేని ప్రభుత్వ భూములలో తేది. 15.10.2019 నాటికి ఇళ్లు కట్టుకొని, ప్రస్తుతం నివాస ముంటూ, ఇంటికి సంబంధించిన ఆధార పత్రాలు కలిగి, ఎక్కడా ఇళ్లు లేని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. 150 గజాల లోపు స్థలంలో ఇళ్లు కట్టుకున్న పేదవారికి ఉచితంగా గాను, అంతకంటే ఎక్కువ స్థలం కలిగిన వారికి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రుసుము వసూలు చేసి క్రమబద్ధీకరించడం జరుగుతుందని తెలిపారు. జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి మాట్లాడుతూ రీ-సర్వే, గ్రామసభలలో వచ్చిన అర్జీలనన్నింటిని రెండు రోజులలో పరిష్కారం చేయాలని తెలిపారు. వెబ్ లాండులో మార్పులు కోసం వచ్చే ప్రతిపాదనలు సర్వేనంబరు, సబ్ డివిజను పూర్తి వివరాలతో పంపించాలన్నారు. వివాదాస్పద భూములు వివరాలు నమోదుచేయునపుడు మొత్తం సర్వేనంబరు కాకుండా సంబంధిత భాగం వివరాలు మాత్రమే నమోదుచేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కె.కె.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస. సుబ్బలక్ష్మి, బి.జె.ఆర్.యు. ఎస్.ఎస్. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.రమామణి, రెవిన్యూ డివిజినల్ అధికారులు వి.వి.రమణ, షేక్ ఆయిషా, కలెక్టరుకార్యాలయ పరిపాలనాధికారి బి.వి.రాణి, సెక్షను సూపరింటెండ్ంట్ లు, సర్వేశాఖ సహాయ సంచాలకులు గోపాలరాజు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర-గొలుగొండ: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు అన్ని మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. బుధవారం గొలుగొండ మండలం కృష్ణ దేవి పేట పోలీస్ స్టేషన్ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి వాటి పురోగతిపై ఎస్సై తారకేశ్వరరావు పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసి ఉంచిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకుని వాటికి సంబంధించిన కేసు వివరాలను ట్యాగ్ చేయాలని ఆదేశించారు అలాగే ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా నిర్వహించేందుకు అన్ని మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు (డైనమిక్ చెకింగ్) నిర్వహించాలని స్పష్టం చేశారు గంజాయి అక్రమ రవాణా సమాచారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా సమాచారం అందించాలని విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు గ్రామాల్లో పోలీసులు తరచు పర్యటించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు అనంతరం కృష్ణదేవపేట నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఎస్పీ సందర్శించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ పాల్గొన్నారు.

నాతవరం పోలీస్‌స్టేషన్ ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర -నాతవరం: బుధవారం అనకాపల్లి జిల్లా పోలీస్ అధికారి తుహీన్ సిన్హా నాతవరం పోలీస్ స్టేషన్ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసులు గురించి అడిగి, వాటి ఫైళ్లను తనిఖీ చేయడం జరిగింది. అంతట స్టేషన్ ప్రాంగణంలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు, పలు మార్గాలలో ఆకస్మిక తనిఖీలు జరపాలని, గంజాయి అక్రమ రవాణా సమాచారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా ప్రజల సమాచారం అందించాలని అన్నారు. అంతేకాకుండా గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులను నిరోధించేందుకు, ప్రధాన కూడళ్ల వద్ద మరియు ముఖ్యమైన ప్రదేశాల వద్ద, సీసీ కెమెరాలు అమర్చాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని సందర్శించి, భవన నిర్మాణ పనులు పురోగతిని సమీక్షించారు. స్టేషన్ ఎస్ఐ భీమరాజుకు, మరియు సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు సూచనలను చేశారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

విశాలాంధ్ర -సబ్బవరం: పశుపోషకులు తమ పశువులకి గాలి కుంటి వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అనకాపల్లి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహన్ రావు తెలిపారు.మండలంలోని అమ్మలపాలెం, అసకపల్లి గ్రామాలలో ఆరిపాక పశు వైద్యాధికారి డా. స్వర్ణలత ఆధ్వర్యంలో నిర్వహించిన టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు రావడం, 104 జ్వరం ఉండడం గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. ఈ వ్యాధి సోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుంది.. చెప్పారు. అందుకే వ్యాధి వచ్చిన తరవాత వైద్యం చేయించుకోవడం కంటే ముందుగానే నివారణ టీకాలు వేయించాలని కోరారు.పశువులకు ఈనెల 30 వరకు ఉచితంగా టీకాలు వేస్తారని, రైతులందరూ వేయించాలని ఆయన సూచించారు. ఈ శిబిరాలలో 75 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు డాక్టర్ స్వర్ణలత తెలిపారు .ఈ కార్యక్రమంలో పశు సహాయకులు కే. లక్ష్మణరావు, యు. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

9న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి విగ్రహ, పసిడి కలశ ప్రతిష్ట మహోత్సవం



విశాలాంధ్ర -నబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం గ్రామంలో పునః నిర్మాణం గావించిన శ్రీ రామలింగేశ్వర, ఉమాదేవి, లక్ష్మీగణపతి, శ్రీ నందీశ్వర, చండీశ్వర శిలా విగ్రహ సహిత పశిడి కలశ ప్రతిష్ఠా స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సర ఫాల్గుణ మాస శుద్ధ దశమి 9 వ తేదీన ఆదివారం ఉదయం 10.54 గంటలకు పునర్వసు నక్షత్రయుక్త వృషభ లగ్నమందు విగ్రహ ప్రతిష్ఠ మరియు పశిడికలశ ప్రతిష్ఠా మహెూత్సవము శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు వారి సంపూర్ణ పర్యవేక్షణలో వీరు కుమారులు శ్రీమాన్ రేజేటి సీతారామాచార్యులు మరియు ఆగమపండితుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ నెల 7 నుండి 9వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠా కార్యామములు జరుగునని తెలిపారు. 7 న శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల కు విగ్రహములు మరియు పశిడికలశల గ్రామ తిరువీధి (ఉత్సవ) ఊరేగింపు జరుగును. సాయంత్రం 5.45 గంటల కు విష్వక్సేనపూజ, భగవత్ పుణ్యాహవాచనము, ఋత్విక్వరుణ, రక్షా సూత్రధారణ, దీక్షా ధారణ, అగ్నిమథనము, అగ్నిప్రతిష్ఠాపన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, హెూమ కార్యక్రమము, దేవతాహ్వానము, జలాధివాసము, నీరాజన మంత్రపుష్పములు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగునని తెలిపారు. 8వ తేదీ శనివారం ఉదయం 7 గంటల కు వేదపారాయణ, పంచగవ్యప్రాశన, బిలాదుద్ధరణ, క్షీరాధివాసము, నిత్య హోమాలు, నీరాజన మంత్రపుష్పమములు, తీర్థప్రసాద వితరణ.సాయంత్రం 5.30 గంటల కు వేదపారాయణ విగ్రహ వాస్తుపూజ, హెూమము, ధాన్యాధివాసము, పంచశయ్యాదివాసము, జీవకళాన్యాసహెూమము, ఉపచారములు, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరుగునని తెలిపారు. 9వ తేదీ ఆదివారం 6.30 గంటలకు వేదపారాయణ, విష్వక్సేనపూజ, భగవత్ పుణ్యాహవాచనము, పంచగవ్యప్రాశన, ప్రతిష్ఠా సంకల్పము, గర్తన్యాశము, రత్నన్యాశము, ఉదయం 10.54 ని.లకు విగ్రహ మరియు పశిడికలశ ప్రతిష్ఠా అనంతరం పూర్ణాహుతి, ధర్వణ. నేను దర్శనము అనంతరం ప్రతిష్ఠాంత శాంతికళ్యాణం, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాద వితరణ జరుగురని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నసమారాధన కార్యక్రమము జరుగును అని తెలిపారు.

రైతులను, వ్యవసాయ కార్మికులను విస్మరించిన ప్రభుత్వాలు

ఏపీ వ్య.కా.స అనకాపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

విశాలాంధ్ర-నర్సీపట్నం: నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలతో కలిసి, బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయం లో డిప్యూటీ తహసీల్దార్కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, వెలుగుల అర్జునరావు, మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో రైతాంగానికి, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, వ్యవసాయ కార్మికులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం చాలా బాధాకరం అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ. 700లు కూలీ ఇవ్వా లని, ఉపాధి పని యంత్రాలతో కాకుండా మనుషులతో చేయించాలని, వలసలు నివారించాలని డిమాండ్ చేశారు. ఎండాకాలంలో ఉపాధి హామీ కూలీలకు టెంట్లు, నీళ్లు,మజ్జిగ మెడికల్ కిట్లు సదుపాయం కల్పించాలని,50సంవత్సరాలు

నిండిన,వృద్ధులైన వ్యవసాయ కార్మికులకు రూ. 5వేలు పెన్షన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా డిమాండ్ చేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు శివలంక కొండలరావు, నల్లబిల్లి శ్రీరామ్ మూర్తి ఎం భాస్కరరావు, రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు మర్రి బాబులు,మేకా సత్యనారాయణ,డి. రాంబాబు ఎల్వి రమణ,శెట్టి పైడియ్య, ఆదిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

సంయుక్త కిసాన్ మోర్చా

విశాలాంధ్ర-అనకాపల్లి: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేసే విధంగా సుప్రీంకోర్టు సుమోటుగా తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి రైతు సంఘాలతో చర్చ జరిపి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రయత్నాలు చేయాలని జిల్లా రైతు సంఘం డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ సి2ం50 మద్దతు ధర అమలు చేయాలని. బడ్జెట్లో 10% నిధులు వ్యవసాయ రంగానికి కేటాయించాలని. విధంగా చర్చ చేపట్టాలని ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు చర్చలు జరిపి సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో దేశీవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు అన్ని రాష్ట్రాల్లో ప్రతి జిల్లాలో కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిన సందర్భంలో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి తగిన మద్దతు ధర ఇచ్చేవరకు దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్ని చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా 10వ తేదీన నిరసన కార్యక్రమం చేపడతా మని వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపించాలని లేనివక్షంలో రైతు సంఘాలు ఆధ్వర్యంలో మరల దేశ రాజధాను వద్ద దీక్ష కార్యక్రమాలు చేపడతామని అన్నారు .ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గండినాయన బాబు. నరాల శెట్టిసత్యనారాయణ. విత్తనాలపోతురాజు. ముదుసు నిలువు , రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్గినపాలెంలో వైభవంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి దర్శనం

దర్శించుకున్న నియోజకవర్గ ఇన్ఛార్జి రాంకీ, కూటమి నేతలు



విశాలాంధ్ర-కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం అమలోధ్భవి హెూటల్ ఎదురుగా ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సం దర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు కలగ గోవింద ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి తమలపాకుల అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పలు పూజలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి తాళ్లపాలెం ప్రాంతానికి చెందిన సాయిబాబా ప్రవచనాలు, భజనలు చేశారు. ఉదయం 11 గంటలకు విశాఖపట్నం కాకానగర్కు చెందిన కోలాటాలు, సాయంత్రం 4 గంటలకు నూతనుగుంటపాలెం గ్రామానికి చెందిన కొలాటాలు ఏర్పాటు చేశారు.

అభయ ఆంజనేయస్వామిని దర్శించుకున్న నియోజకవర్గ ఇన్ఛార్జి రాంకీ...

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి భీమరశెట్టి రాంకీ. మండల కూటమి నేతలు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి స్వాగతం పలికి సన్మానించారు.

వేములపూడిలో ఐసిడిఎస్ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-నర్సీపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నర్సీపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వేములపూడిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ బి రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అని రంగాల్లోనూ రాణిస్తున్నప్పటికీ సమాజంలో ఇంకా మహిళలపై వివక్షత కొనసాగుతుందన్నారు. వివక్షత రూపు మాపాలంటే ఇంకా మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు . చిన్నప్పటి నుంచే ఆడపిల్లలను చదివించడం ద్వారా ఆడపిల్లలకు భరోసా కల్పించినట్టు అవుతుందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా ఐసిడిఎస్ ద్వారా ప్రజలకు అందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. మహిళలకు ఆడపిల్లలకు చిన్నారులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా ఐసిడిఎస్ కి సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు ద్వారా భాధితులకు సత్వరమే చేకూరుతుందన్న విషయాన్ని ఈ సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ చేస్తూ నినాదాలు రూపంలో తెలియజేశారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో బాలికల పాఠశాల హెచ్ ఎమ్ కె.కృష్ణవేణి, ఎమ్ఎస్ కె అరుణ, అంగన్వాడీ వర్కర్స్ గడమాల ఆశాజ్యోతి, బి.రేవతి, దేవి, యర్రయమ్మ, సరోజినీ,దేవుడమ్మ,లక్ష్మి, వరహాలమ్మ, వెంకయ్యమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం పై ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు కృషి : పిఆర్‌టియు

విశాలాంధ్ర-యస్ .రాయ వరం : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు గాదె శ్రీనివాసులు నాయుడు కృషి చేస్తారని మండల పిఆర్టియు అధ్యక్షుడు భద్ర రావు అన్నారు బుధవారం మండలంలోని పెనుగొల్లు ,సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ గెలుపు విజయోత్సవాలలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..పెండింగ్ లో ఉన్న అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని అన్నారు .గెలుపుకు కృషి చేసిన ఉపాధ్యాయులు వివిధ సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సమన్వయకర్త సత్యనారాయణ ,మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు , వైద్యాధికారులు ,సిబ్బంది పాల్గొ న్నారు.

శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు

విశాలాంధ్ర-కే కోటపాడు: విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ , శారీరక ధారుడ్యం ఎంతో అవసరమని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి కే రత్నకుమారి అన్నారు. మండల కేంద్రం శ్రీ వేణు విద్యానికేతన్ లో 6, 7, 8 తరగతులు చదువుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్ లో శిక్షణ పొందిన 44 మంది విద్యార్థిని విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ ఈ సంస్థ చిన్ననాటి నుండే విద్యార్థులకు మంచి నడవడికతో పాటు సమాజంలో భావిభారత పౌరులుగా తయారయ్యేందుకు అవసరమగు శిక్షణ అందిస్తుందన్నారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత చదువుల కోసం రిజర్వేషన్ సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పిస్తుంది అన్నారు ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ వై. సోనీ , వేణు విద్యానికేతన్ కరస్పాండెంట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు బహూకరణ

విశాలాంధ్ర -పాయకరావుపేట : మండలంలోని వెంకటనగరం శివారు రాజానగరం గ్రామ నూకలమ్మ అమ్మ వారి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 20 కుర్చీలు బహుకరించారు. పాఠశాల హెచ్ఎం రహీమ్ ఆలయ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పాఠశాల కమిటీ చైర్మన్ జి. శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం,,,

విశాలాంధ్ర -కె.కోటపాడు: అధికారులు దూషించారన్న కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై అంగన్వాడి టీచర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఇక్కడ జరిగింది. ఈ మండలం పోతన వలస గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని పి వో మంగతాయారు , సూపర్వైజర్ రాములమ్మ ఈనెల 1న తనిఖీ చేశారు. టీచర్ రొంగలి నూకరత్నం విధులను సక్రమంగా నిర్వహించలేదని, రికార్డులు సరిగ్గా లేవని మందలించి రికార్డులు తమతో పాటు ప్రాజెక్టు కార్యాలయానికి తీసుకుపోయారు. ఈనెల మూడవ తేదీన నూకరత్నం ప్రాజెక్ట్ కార్యాలయానికి వెళ్లి తన రికార్డు ఇమ్మని కోరారు. అప్పుడు కూడా పివో, సూపర్వైజర్ ఇరువురు వ్యక్తిగత దూషణలకు దిగుతూ నీ పనితీరు బాగోలేదని , జీతం నిలిపివేస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం తెల్లవారుజామున చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పూనుకుందని ఆమె భర్త దేవుడు నాయుడు విలేకరులకు తెలిపారు. అపస్మారకస్థితిలో ఉన్న నూకరత్నాన్ని కె కోటపాడు ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా అంగన్వాడి టీచర్ నూక రత్నంపై కక్ష సాదింపు చర్యలకు పాల్పడిన పిఓ సూపర్వైజర్ ల ను సస్పెండ్ చేయాలని సిఐటియు నాయకులు రంగలి ముత్యాల నాయుడు , ఈర్లె నాయుడు బాబు , ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. ఉద్యోగ పరంగా ఏమైనా తప్పులు జరిగితే సంజాయిషీ అడగాలి లేదా పనిష్మెంట్ ఇవ్వాలి తప్ప వ్యక్తిగత దూషణలు చేయకూడదని వారన్నారు. అంగన్వాడి టీచర్ కు ఏ ప్రమాదం జరిగిన పిఓ సూపర్వైజర్లదే బాధ్యత అని వారు తెలిపారు. ఈ విషయమై పిఓ సూపర్వైజర్ ను వివరణ కోరడానికి ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు. ..

9న జనసేన పార్టీ 20 మంది ఎమ్మెల్యేలు పాయకరావుపేట రాక

విశాలాంధ్ర-పాయకరావుపేట: ఈ నెల 9వ తేదీన జనసేన పార్టీ నియోజకవర్గ సమావేశం పాయకరావుపేటలో రఘుపతి కన్వెన్షన్ హాల్లో జరగనున్నట్లు జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గెద్దం బుజ్జి తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గెద్దం బుజ్జి మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవానికి దిశ, నిర్దేశం చేసేందుకు జనసేన పార్టీ నుంచి గెలిచిన 20 మంది ఎమ్మెల్యేలు పాయకరావుపేట వస్తున్నట్లు తెలిపారు. 20 మంది ఎమ్మెల్యేలకు భారీ స్వాగతం పలికేందుకు జన సైనికులంతా తరలిరావాలని కోరారు. ఈనెల 9 న పాయకరావుపేట లో జరిగే జనసేన పార్టీ నియోజకవర్గ సమావేశానికి జనసేన నేతలు గురాన అయ్యలు, మల్లాడ రాజేంద్ర సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెద్దం చైతన్య, ఎగదాసు నానాజీ, వెలగా సుధాకర్, శ్రీను, పప్పల శివ, నారపురెడ్డి పద్మావతి, పల్లి దుర్గారావు, జగ్గన్న దొర, ఆచంట దొర, కట్టా శ్రీను, కర్రి బాబూరావు, శివలంక నాగమల్లి, బి.ఎస్.నారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్ రావు మృతి బాధాకరం- కరణం ధర్మశ్రీ

విశాలాంధ్ర-రాంబిల్లి: నగిరెడ్డి ప్రభాకర్ రావు మరణ వార్త తనను కలచి వేసిందని మాజీ విప్, అనకాపల్లి జిల్లా వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం దిమిలి గ్రామంలో గల ప్రభాకర్ స్వగృహానికి వచ్చిన ధర్మశ్రీ ప్రభాకర్ రావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌లో ప్రభాకర్‌రావుతో కలిసి పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రభాకర్ రావు కుటుంబ సభ్యులు నాగేశ్వరరావు, రమేష్, శ్రీనులతో పాటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. కార్యక్రమంలో రాంబిల్లి మండల పార్టీ ప్రెసిడెంట్ కిషోర్, జెడ్పిటిసి నాగరాజు,మురళీకృష్ణ, అచ్చుతాపురం మండల వైసీపీ ప్రెసిడెంట్ శంకర్రావు, గేదెల శ్రీనివాస్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపుల లాటరీ నేడే

విశాలాంధ్ర-చోడవరం : ప్రభుత్వ ఎక్సైజ్ అండ్ ప్రొబేషన్ శాఖ కల్లుగీత కార్మికులకు రిజర్వేషన్ పద్ధతిన కేటాయించిన జిల్లాలో 15 మద్యం షాపులకు నేడు (గురువారం) డ్రా తీయనున్నట్లు చోడవరం ఎక్సైజ్ సీఐ కె. పాపు నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అనకాపల్లిలోని గుండాల జంక్షన్ వద్ద శంకరన్ మీటింగ్ కాంప్లెక్స్ లో మద్యం షాపులకు డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రాలో పాల్గొనున్న దరఖాస్తుదారుడు వారి యొక్క కుల ధ్రువీకరణ పత్రము, అడ్రస్ ప్రూఫ్, ఎంట్రీ పాసులు విధిగా తీసుకురావలసిందిగా కోరారు.

పి ఫోర్ సర్వేపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పాయకరావుపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పి ఫోర్ సర్వే పై పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో జయప్రకాశరావు సూచించారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ భాగస్వామ్యంతో అతి పేదలను, మధ్య తరగతి లోనికి తీసుకు రావడానికి, ధనవంతులయిన పది శాతం మంది సహాయ సహకారాలు తీసుకొని వారిని ఆర్థికంగా బలపరిచేందుకు సర్వే జరుగుతుందని తెలిపారు. 21వ తేదీన గ్రామసభలో ఎంపిక చేసిన కుటుంబాల వివరాలు తెలియజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ అక్బల్, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటేషన్

విశాలాంధ్ర-చోడవరం : అంతర్జాతీయ మహిళా

దినోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా బుధవారం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈనెల ఒకటి నుండి 8 వరకు పోలీసుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చోడవరం స్టేషన్ ఎస్సై జోగారావు మీడియాకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో చోడవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది, మరియు ఉపాధ్యాయలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీతలు నిర్వహణ

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ సురేష ఆధ్వర్యంలో బుధవారం జెసిబి సహకారంతో పూడికతీతలు చేపట్టారు. డ్రైనేజీ కాలువల్లో చెత్త చెదారాలతో నిండిపోయిన కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా ఉండేందుకు గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూడిక తీత పనులకు శ్రీకారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా వల్ల అనర్థాలపై అవగాహన

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : చోడవరం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కెవి పాపునాయుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం బుచ్చయ్యపేట మండలంలోని పుణ్యంపూడి, చినభీమవరం, గొర్రెలపాలెం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి గ్రామ ప్రజలకు నాటు సారాయి తాగడం వలన కలిగే అనర్థాలు తెలియజేసి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం శేఖరం, పిసి ఎం. అప్పలనాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామ సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాకలు, వరి కుప్పలు దగ్ధం



విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలం వడ్డాది కస్పా పొలాలు వద్ద పశువుల పాకలు, వరి కుప్పలు, టైరు బండి దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి దాటాక ఈ దురాగాతనానికి పాల్పడి ఉంటారని బాధితులు ఆరోపిస్తున్నారు. బుధవారం తెల్లవారుజాముకి మొత్తం ఖాళీ అయ్యాయి. చోడవరం అగ్నిమాపక సిబ్బంది చేరుకునే లోపే జరగాల్సిన నష్టం అంతా జరిగిపోయింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన కుబిరెడ్డి ప్రకాష్, దొరబాబు, ఈశ్వరరావు, లింగంపల్లి శోభన్ బాబుకు చెందిన 2 ధాన్యం కుప్పలు, పాకలో నిల్వ ఉంచిన 30 బస్తాల ధాన్యం పశువుల పాకలు, టైరు బండి దగ్ధం అయ్యాయి. ఎద్దులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం సంభవించడంతో బాధిత కుటుంబ సభ్యులు లబోదిబో మంటున్నారు. ఏడాది కాలం పాటు కష్టపడి పండించిన పంట అంతా అగ్నికి ఆహుతి అవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పాకలు, కుప్పలు దూరంగా ఉన్నప్పటికీ మంటలు అంటుకోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరో కావాలనే నిప్పు అంటించి ఉంటారని బాధితులు ఆరోపించారు. స్థానిక ఎస్సై ఏ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల నుండి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దర్యాప్తు చేపట్టాలని గ్రామస్తులు బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక కూటమి నేతలు దొండా నరేష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, వైసీపీ నేత జడ్పిటిసి దొండా రాంబాబు తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

ఉపాధి కార్మికులకు ఆరు వారాల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్

విశాలాంధ్ర-మునగపాక : మండలంలో ఉపాధి హామీ కార్మికులు బకాయి పడ్డ ఆరు వారాల వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం గనిశెట్టి మండలంలో వెంకటాపురం గ్రామంలో ఉపాధి హామీ కార్మికులుతో పని ప్రాంతంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఆరువారాలగా పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులకు వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ప్రతి వారం వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని, తట్టకీ పారకి గుణపాంకి డబ్బులు చెల్లించాలని, మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు ఉంచాలని డిమాండ్ చేశారు. రోజుకి వేతనం 600 రూపాయలు చెల్లించాలని అన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 12న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గనిశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఉపాధి హామీ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పసుపురెడ్డి నర్సింగరావు, కడియం పద్మ, పి.గోవిందమ్మ, జి.నాగమణి, ఎస్.రాము, సిహెచ్. ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పైడివాడ అగ్రహారం ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ లేఔట్‌లో యదేచ్ఛగా గ్రావెల్ దందా!

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన జగనన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్ ప్రస్తుతం ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ లేఔట్ గా పేరు మార్చిన లే అవుట్ లో గత రెండు రోజులుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు యాదవిధిగా కొనసాగుతున్నాయి. అయితే ఈ లేఔటు కు భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్ సి ప్లాట్లు అభివృద్ధికి వి ఎం ఆర్డి ఎ అధికారులు వెనకబడటంతో గ్రావెల్ అనుమతుల కోసం స్థానిక తాసిల్దారు బి. చిన్నికృష్ణ మైనింగ్ అధికారులకు అనుమతుల కోసం లేఖ రాశారు. ఆ లేఖను గ్రామానికి చెందిన నేతలు పట్టుకొని తమకు అనుమతులు ఇచ్చారంటూ అక్రమ గ్రావెల్ తవ్వకాలు రవాణా కొనసాగిస్తున్నారు. సబ్బవరం పాత్రికేయులు మంగళవారం వెళ్లి ఆరా తీయగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తాసిల్దార్ స్పష్టం చేశారు. అలాగే అనకాపల్లి జిల్లా మైన్స్ ఎ డి శ్రీనివాస్ ను బుధవారం విలేకరులు ఫోన్లో సంప్రదించగా తాము గ్రావెల్ తవ్వకానికి గాని రవాణాకు గాని ఎటువంటి అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. అయితే సబ్బవరం తాసిల్దారు అనుమతులు కోరుతూ లేఖ రాశారే తప్ప, ఫలానా సర్వే నెంబర్ లో గాని, ఫలానా కొండలో గాని, పలానా స్థలంలో గాని ఆయా రెవిన్యూ సర్వే నెంబర్లు వేసి తమకు దరఖాస్తు చేయలేదని స్పష్టం చేశారు. గ్రావెల్ మాఫియా తగ్గేది లేదంటూ రెచ్చిపోతున్నారు. ఈ అర్బన్ హౌసింగ్కి గా లేఔట్ లో సుమారు 200 ప్లాట్లు మేరకు మాయం చేశారు. అలాగే రెవెన్యూ అధికారులు, వీఎంఆర్డీఏ అధికారులు గ్రావెల్ మాఫియా కు కొమ్ముకాస్తూ గ్రావెల్ దందా కొనసాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైడివాడ అగ్రహారం గ్రామంలో భూములు పోయిన రైతులకు ఇచ్చిన ఆర్ సి ప్లాట్లు అభివృద్ధి చేయకుండా నంగినారపాడు, గొల్లలపాలెం, గాలి భీమవరం, అజనగిరి గ్రామాల్లో గల లేఔట్లకు గ్రావెల్ తరలించడం ఎంతవరకు సబబు అని గ్రామానికి చెందిన నేతలు నిలదీశారు. అయినప్పటికీ గ్రావెల్ దందాదారులు అక్రమ తవ్వకాలు, గ్రావెల్ రవాణా నిలుపుదల చేయకుండా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుచున్నారు.

కేన్సర్ రోగులకు పెట్ స్కాన్ ఆరోగ్యశ్రీలో చేర్చాలి : ఎమ్మెల్సీ ఇందుకూరి



విశాలాంధ్ర-శృంగవరపుకోట : రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనమండలి లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు. ప్రత్యేక ప్రస్తావన లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రము లో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం అందిస్తున్నా కేన్సర్ రోగులకు ఆరోగ్య స్థితిని తెలుసుకోవటం కోసం తీసే పెట్ స్కాన్ ఇందులో చేర్చలేదు అని, ఈ స్కాన్ బయట 25,000 వరకు ఖర్చు అవుతోంది కాగా అగనంపూడి లో ఉన్న హోమి బాబా కాన్సర్ హాస్పిటల్ లో ఇది రూ 9500 వరకు అవుతోంది అని, ఇది వ్యాధి గ్రస్తులకి కొంత ఉపశమనం కలిగించిన, సామాన్య పేద ప్రజలకి ఇది పెను భారం అవుతోంది అని అన్నారు. అలాగే రోగి ఇంటి నుంచి బయటికి వెళ్ళి పనులు చేసుకోలేని పరిస్థితులలో అప్పటి ప్రభుత్వం 5,000 రూపాయలను జీవన భృతిగా రోగుల ఖాతాలో జమ చేసేవారు. ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం వచ్చాక గత 8 నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి అలాగే ఎంత దూరం నుంచి ఆసుపత్రి కి వచ్చినా రవాణా చార్జీలు కింద రెండు మూడు రోజులకి కలిపి 50 రూపాయలు ఇస్తున్నారు అని ఆసుపత్రి సిబ్బంది లేఖలు ఇస్తున్నారు కానీ ఈ డబ్బులు కూడా చెల్లించట్లేదు డబ్బులు రాలేదు అని సిబ్బంది చెబుతున్నారు. కొన్ని రకాల మందులు ఆరోగ్యశ్రీ లో పెట్టలేదు ఇటువంటి వాటిని బయట కొనుకోవాల్సి వస్తోంది అని కావున ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాల్సింది అని ఆయన ఆరోగ్య శాఖ మంత్రిని మండలి లో కోరారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామం లో రామాలయం వద్ద బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి వారి సౌజన్యంతో గ్రామ సర్పంచ్ మరిసా నాని ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిభిరం నిర్వహించారు. ఈ శిబిరం లో 136 మంది కంటి రోగులకు పరీక్షలు చేసి ,36 మందికి కంటి ఆపరేషన్ లకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. అలాగే కంటి నరాలు చికిత్స కోసం 3, కంటి పై పొర చికిత్స కోసం 4, కంటి నీటి కాసుల చికిత్స కోసం 1, కంటి రెప్పల చికిత్స కోసం 1, చిన్నపిల్లల కంటి చికిత్స కోసం 1, వీరిని ప్రత్యేకంగా మా వద్ద ఉన్న స్పెషలిస్టులు (ప్రముఖ డాక్టర్లు) చే ఆసుపత్రిలో చికిత్స చేయుటకు ఈ శిబిరం నుండి మా వద్దకు సిపారస్సు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరిసా నాని, శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ జాన్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ గీత, సాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హోంమంత్రి అనిత పుట్టినరోజును పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - పాయకరావుపేట : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పుట్టినరోజు పురస్కరించుకొని నక్కపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తెలిపారు. పాయకరావు పేటలో తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ టోర్నమెంట్లో ఆడే టీములు ఈనెల 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టోర్నమెంట్లో పాల్గొనేవారు నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలని తెలిపారు. టోర్నమెంట్లో మొదటి బహుమతి రూ.1 లక్ష, ద్వితీయ బహుమతి రూ. 50 వేలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ. 15 వేలు, బెస్ట్ బ్యాట్స్ మెన్ రూ. 10 వేలు, బెస్ట్ బౌలర్ రూ. 10 వేలు బహుమతి అందజేస్తారని తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పంకా వెంకటరమణ, బొంది కాశివిశ్వనాద్, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, బత్తిన అచ్చిరాజు, రావాడ గోవిందరెడ్డి, సూర సుబ్రహ్మణ్యం, వేములపూడి అప్పారావు, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయ ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన

-అందుబాటులో ఉన్న వర్మి కంపోస్టు

విశాలాంధ్ర-రాంబిల్లి : మండలం మలిజంప గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 పై బుధవారం గ్రామ కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. సచివాలయంలో జరిగిన గ్రామ స్థాయి సమావేశంలో ఎంపిడివో జయ మాధురి, ఎమ్ఎఓ సుమంత,ఏపీఎం పద్మావతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సుమంత మాట్లాడుతూ 2025 ఖరీఫ్‌లో 100 శాతం సహజ వ్యవసాయం సాధించడానికి ఖరీఫ్ కార్యాచరణ, ప్రణాళిక, ఇన్‌పుట్‌ల,6 రకాలు పంటలకు సంబంధించిన పి ఎమ్ డి ఎస్ కిట్‌ల అవసరాలను, కార్యాచరణ ప్రణాళిక ప్రారంభించే ముందు చేయాల్సిన సర్వేపై చర్చించారు. సహజ వ్యవసాయ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించి అవగాహన కల్పించారు. అనంతరం ఎంపిడివో జయమాధురి చేతుల మీదగా రైతులకు వర్మీ కంపోస్ట్ పంపిణీ చేశారు. వర్మి కంపోస్టు రైతులకోసం పంపిణీకి అందుబాటులో ఉందని, రైతులందరూ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఖాదర్ బాబా దర్బార్‌లో రంజాన్ చార్‌దిన్ ఇఫ్తార్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సర్వమత సమ్మేళనాన్ని చాటి చెప్పేలా రంజాన్ మాస పర్వదినాన్ని పురస్కరించుకుని హుజూర్ హజరత్ సూఫీ ఆధ్యాత్మిక చక్రవర్తి బాబా సయ్యద్ ఖాదర్ అవులియా వారి దర్బార్ లో రంజాన్ తీన్ దిన్ ఇఫ్తార్ విందు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లీం సోదరులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు, బాబా భక్తులకు ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఖాదర్ షా దర్గా దర్బార్ ముతవల్లి(ధర్మకర్త) మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ సాబిరీ(ఖలీల్ బాబు) ప్రేమతో అందరినీ ఈ విందుకు ఆహ్వానించి, ఆయనే స్వయంగా వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లీం సోదరులతో పాటు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.